


# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

మంగళవారం, ఆగస్టు 5, 2025

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-

# ఏకపక్షం కాదు: హరీశ్

- తెలంగాణ భవన్‌లో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్న హరీశ్‌రావు
- కాళేశ్వరం బరాజ్‌ల నిర్మాణం కేసీఆర్ సొంత నిర్ణయం కాదు
- ఈ ప్రాజెక్టుకు కేబినెట్‌తోపాటు అసెంబ్లీ ఆమోదం కూడా ఉంది
- పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ కార్యక్రమంలో హరీశ్‌రావు స్పష్టీకరణ
- వ్యాప్కోస్ నివేదిక, హై పవర్ కమిటీ సిఫారసులు, సీడబ్ల్యూసీ ఆమోదం మేరకే నిర్మాణం
- వాస్తవాలు లేకుండా వండి వార్చిన నివేదికను ప్రభుత్వం బయటపెట్టింది
- సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు
- కేసీఆర్‌ను హింసించాలన్నదే ఆయన ఉద్దేశం.. కమిషన్ నివేదిక కోర్టు ముందు నిలవదు
- అసెంబ్లీలో పూర్తి నివేదికను పెడితే ప్రభుత్వాన్ని చీల్చిచెండాడతాం..
- కాళేశ్వరం తెలంగాణకు వరప్రదాయిని..అధికారంలోకి రాగానే నిరూపిస్తాం



హైదరాబాద్: 'కాళేశ్వరం ప్రాజెక్టుపై వాస్తవాలు లేకుండా వండి వార్చిన నివేదికను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బయట పెట్టింది. ఈ ప్రాజెక్టుకు కేబినెట్‌తో పాటు అసెంబ్లీ ఆమోదం కూడా ఉంది. గవర్నర్ ప్రసంగంలో కాళేశ్వరం అంశం ఉండటం కేబినెట్ ఆమోదాన్ని సూచిస్తుంది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల నిర్మాణం నాటి సీఎం కేసీఆర్ సొంత నిర్ణయం కాదు. వ్యక్తుల నిర్ణయం ఆధారంగా బరాజ్‌ల నిర్మాణం జరగలేదు. వ్యాప్కోస్ నివేదిక, హై పవర్ కమిటీ సిఫారసులు, కేబినెట్ నిర్ణయం, సీడబ్ల్యూసీ ఆమోదం మేరకు జరిగాయి. సీఎం రేవంత్‌రెడ్డి పాలనను గాలికి వదిలి రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. 'డబ్బులు దండుకునేందుకు కమీషన్లు..కక్ష సాధింపుల కోసం కమిషన్లు' అన్నట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం తీరు ఉంది. తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు రేవంత్ టీవీ సీరియళ్ల తరహాలో కమిషన్లు, విచారణలతో కాలం గడుపుతున్నాడు. కేసీఆర్‌ను హింసించాలన్నదే ఆయన ఉద్దేశం. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కలిసి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నాయి..' అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. 'కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ కుట్రలు.. కమిషన్ వక్రీకరణలు, వాస్తవాలు' అనే అంశంపై మంగళవారం తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో పార్టీ ముఖ్య నేతలు, రైతులు దీనిని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డ వద్దకు బరాజ్ మార్చడంలో నాటి సీఎం కేసీఆర్ ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారంటూ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన ఆరోపణలను




# ఉత్తరాఖండ్‌లో వరద బీభత్సం

**వరద ప్రభావానికి గురైన ధరాలీ గ్రామం**

**ఎన్డీఆర్ఎఫ్‌తో కలిసి సహాయక చర్యలు చేపట్టిన సైన్యం**

ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలు, వరదలు పెను బీభత్సం సృష్టిస్తున్నాయి. ఉత్తరకాశీలోని ధరాలీలో కొండపై నుంచి ఒక్కసారిగా వచ్చిన వరద బురదతో ఆ గ్రామం మొత్తం కొట్టుకుపోయింది. ఇప్పటికే నలుగురు మృత్యువాత పడగా, తాజాగా దాదాపు పది మంది సైనికులు వరదనీటిలో గల్లంతైనట్లు తెలుస్తోంది. వరదకు తీవ్రంగా ప్రభావితమైన ధరాలీ గ్రామానికి కేవలం నాలుగు కిలోమీటర్ల దూరంలోనే ఆర్మీ బేస్ క్యాంప్ ఉంది. హర్షిల్ ఆర్మీ క్యాంపస్‌కు దిగువన ఉన్న సైనికులు వరద ఉద్ధృతికి కొట్టుకుపోయినట్లు తెలుస్తోంది. వారి కోసం సైన్యం గాలింపు చర్యలు చేపట్టింది. ధరాలీ గ్రామంలో అడుగుల మేర బురద పేరుకుపోవడంతో సైన్యం రంగంలోకి దిగింది. 150 మంది సభ్యుల బృందం, ఎన్డీఆర్ఎఫ్‌తో కలిసి సహాయక చర్యలు చేపడుతోంది. ఒకవైపు తమ బృంద సభ్యులు గల్లంతైనప్పటికీ, నిరాటంకంగా సహాయక కార్యక్రమాలు సైన్యం కొనసాగిస్తోంది. అయితే ఎక్కడికక్కడ బురద మేటలు వేయడం, ఇళ్లు, దుకాణాలు దెబ్బతినడంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. కాగా, ఉత్తరాఖండ్ వరద బీభత్సానికి సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



# చిన్న సాయమైనా కష్టాల్లో ఉన్న కుటుంబానికి కొండంత అండ: సీఎం చంద్రబాబు

- పీ4 కార్యక్రమంపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష
- ఆగస్టు 19 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 'పీ4' కార్యక్రమం అమలు
- 2029 నాటికి జీరో పావర్టీ సాధించడమే ప్రధాన లక్ష్యం
- 'మార్గదర్శులు' స్వచ్ఛందంగా 'బంగారు కుటుంబాలకు' సాయం
- పేద వృద్ధురాలికి అండగా నిలిచిన పారిశుద్ధ్య కార్మికురాలికి సీఎం ప్రశంస

డబ్బుతో పని లేదు, స్పందించే మనసుంటే చాలు... పేదలకు అండగా నిలిచేందుకు అదే పెద్ద అర్హత... చిన్న సాయమైనా సరే, కష్టాల్లో ఉన్న కుటుంబానికి అది కొండంత భరోసా ఇస్తుంది... సరిగ్గా ఇదే స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్‌లో పేదరికంపై సరికొత్త యుద్ధానికి రాష్ట్ర ప్రభుత్వం తెరలేపిందని

# మంత్రిపదవి ఇస్తరా.. ఇవ్వరా మీ ఇష్టం: రాజగోపాల్‌రెడ్డి



- పదవి కోసం కాళ్లు పట్టుకొని బతిమిలాడే రకం కాదు నేను
- అవసరమైతే మళ్లీ త్యాగం చేస్తా
- నిన్నమొన్న వచ్చిన జూనియర్లకు పదవులు ఇచ్చారన్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

సంస్థాన్ నారాయణ పురం: 'ప్రజల మధ్యనే ఉంటా.. ప్రజల కష్ట సుఖాల్లో పాలుపంచు కుంటా.. వారి కోసం ఎంత దూరమైనా పోతా.. అవసరమైతే మళ్లీ త్యాగం చేస్తా' అని మును గోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని లచ్చమ్మగూడెం, చిమిర్యాల గ్రామాల్లో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి మంగళవారం విద్యుత్ సబ్‌సేష్టన్‌లను ప్రారంభించారు. అనంతరం రాజగోపాల్‌రెడ్డి మాట్లాడారు. పూర్తి వివరాలు ఆయన మాటల్లోనే.. 'నేను మాట్లాడితే మంత్రిపదవి రాలేదు కాబట్టే మాట్లాడుతున్నానని కొందరు ఆరోపిస్తున్నారు. మంత్రిపదవి కావాలనుకుంటే నేను ఎల్బీనగర్ నుంచి పోటీ చేసేవాడిని. మునుగోడు నియోజకవర్గ ప్రజల అభివృద్ధి కోసమే నేను ఇక్కడి



# నేడు ఢిల్లీలో కాంగ్రెస్ 'రిజర్వేషన్' ధర్నా

- ఏర్పాట్లపై మాట్లాడుతున్న వాకిటి శ్రీహరి, మహేశ్‌గౌడ్, మల్లు రవి
- బీసీలకు 42% రిజర్వేషన్ల సాధనకై జంతర్‌మంతర్‌లో మహాధర్నా
- పాల్గొననున్న ఖర్గే, రాహుల్, సీఎం రేవంత్, మంత్రులు
- ఇండియా కూటమి పార్టీల ఎంపీలూ హాజరయ్యే అవకాశం
- ధర్నాస్థలిని పరిశీలించిన పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్, మంత్రులు

న్యూఢిల్లీ: తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని అసెంబ్లీలో ఆమోదించి పంపిన బిల్లుపై కేంద్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకునేలా ఒత్తిడి తెచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ బుధవారం ఢిల్లీలో మహాధర్నా నిర్వహించనుంది. జంతర్ మంతర్‌లో ఈ కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి.

# న్యాయ వ్యవస్థనే అవమానిస్తారా?

**::: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఫైర్**



- కమిషన్ నివేదికలోని అంశాలను మాత్రమే ప్రభుత్వం వెల్లడించింది
- ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు హైడ్రాలజీ అనుమతులు ఇస్తే దాచి పెట్టారు
- కేబినెట్ ఆమోదం లేకుండానే కాళేశ్వరం చేపట్టారు
- బరాజ్‌లు ఎక్కడ కట్టాలో మీరే నిర్ణయించుకున్నారు..
- బండారం బట్టబయలైనందుకే కమిషన్‌ను తప్పు పడుతున్నారు
- ఇప్పటికైనా నాలుగు కోట్ల ప్రజలకు క్షమాపణలు చెప్పండి



# కాళేశ్వరం కమిషన్ నివేదిక ట్రాష్, గ్యాస్

# రెండేళ్లు బయట చదివితే స్థానికులు కాదా?



- నీట్ స్థానికత కేసులోరాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ప్రశ్న
- పదేళ్ల గడువు ముగిసినందునే జీఓ 33 తెచ్చామన్న ప్రభుత్వం
- ఆ జీఓను 2028లో ఎందుకు అమలు చేయకూడదని ప్రశ్నించిన కోర్టు
- వాదనలు ముగించి, తీర్పును రిజర్వ్ చేసిన సీజేఐ ధర్మాసనం
- వచ్చే శుక్రవారం వరకు లిఖితపూర్వక వాదనలు సమర్పించాలని ఆదేశం







## లార్డ్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ సక్సెస్ ఫుల్ గా

# పేరెంట్స్ ఓరియంటేషన్ ప్రోగ్రాం

బాలాపూర్, వార్త మిర్రర్ : లార్డ్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ జిల్లెలగూడ బ్రాంచ్ లో పేరెంట్స్ ఓరియంటేషన్ ప్రోగ్రాం ఎంతో ఆసక్తికరంగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులకు విద్యాసంస్థ విధానాలు , అకాడమిక్ ప్రణాళికలు ,విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. అధ్యాపకులు విద్యార్థుల విద్య ,నైపుణ్య ,నైతిక సంపన్నతపై తీసుకుంటున్న శ్రద్ధను ఈ సందర్భంగా వివరించారు .అయితే ఈ సంవత్సరం పరిచయం చేసిన క్రిసాలిస్ స్టూడియోస్ యొక్క ప్రత్యేకతను గురించి తెలియజేయడం జరిగింది. టెక్ట్ బుక్స్ వర్సెస్ స్టూడియో విషయానికి వస్తే క్రిసాలిస్ స్టూడియోలు చాలా ముందున్నాయి. సాధారణ పాఠ్యపుస్తకాలు ఎటువంటి కార్యకలాపాలు లేకుండా పాఠాల ముక్కలతో నిండి ఉన్నాయి కానీ క్రిసాలిసు స్టూడియోల విషయంలో అలా కాదు వీటిలో కార్యకలాపాల ద్వారా విద్యార్థులు తాము నేర్చుకున్న వాటిని అర్థం చేసుకొని గుర్తుపెట్టుకుంటారు. మరియు ప్రశ్నలు భావనలను పూర్తిగా అర్థం చేసుకునేలా చేస్తుంది. ముఖ్యంగా ఈ క్రిసాలిసు స్టూడియోల లో ఏదైనా ప్రామాణిక పరీక్షకు ఆధారమైన జ్ఞానం, అవగాహన ,అనువర్తనం మరియు నైపుణ్యాన్ని జాగ్రత్తగా చూసుకుంటుంది క్రిసాలిస్ యొక్క ప్రత్యేకత గురించి క్రిసాలిస్ మేనేజర్ శ్రీ చాణిక్య గారు చాలా చక్కగా వివరించారు అంటే విద్యార్థులు సృజనాత్మకంగా మరియు విమర్శనాత్మకంగా తమ ఆలోచనలను వ్యక్తీకరణలో నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడానికి అవకాశం లభిస్తుంది అన్నారు .ఈ స్టూడియో మా విద్యార్థులకు వారి అధ్యయనం మరియు అవగాహనను ప్రదర్శించడానికి అందమైన కాన్వాస్ ను అందిస్తుంది. సరదాగా మరియు రంగురంగుల చిత్రాలతో నిండిన థింగ్ రూమ్ పుస్తకాలను స్టూడియో అని పిలుస్తారు .ఇవి లోతైన బోధన పరిశోధన ఆధారంగా రూపొందించబడ్డాయి స్టూడియోలోని ప్రతి కార్యాచరణను జాగ్రత్తగా ఎంపిక చేసి ,రూపొందించి గ్రేడ్ తగిన అభ్యాస ఫలితాలకు అనుగుణంగా అమరచబడుతుంది. ప్రతి పాఠంలో విలువలు విలీనం చేయబడతాయి . కాగా క్రిసాలిసు స్టూడియో వల్ల వచ్చే ఫలితాలను క్రిసాలిస్ కోఆర్డినేటర్ అయినా శ్రీ సతీష్ గారు అద్భుతంగా తెలియజేశారు. అనగా పిల్లవాడు నేర్చుకునే ప్రతి దశలోనూ నిమగ్నమై ఉంటాడు అని భావనలు విద్యార్థులకు చెప్పబడవు తప్ప ఉద్భవిస్తాయి అని పేర్కొన్నారు .ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన శ్రీ లార్డ్స్ గ్రూప్ ఆఫ్ చైర్మెన్ శ్రీ సిద్ధాల బీరప్ప గారు మాట్లాడుతూ పాఠాలు విభిన్న అభ్యాస శైలులకు అనుగుణంగా ఉంటాయని ప్రతిపాఠంలో విలువలు విలీనం చేయబడతాయని, వ్యక్తీకరణలకు ఖాళీ స్థలాలు విద్యార్థుల ఆలోచనలు మెరుగుపరుస్తాయని తెలియజేశారు. కాగా లార్డ్స్ గ్రూప్ ఆఫ్ వైస్ చైర్మన్ శ్రీ బెర్లు శ్రీనివాస్ రెడ్డి గారు మాట్లాడుతూ పిల్లలు గణితంలో సమస్యలను పరిష్కరించడం నేర్చుకోవడమే కాకుండా గణితంలో కూడా సమస్యలను సృష్టించగలరని తెలియజేశారు .మరియు పాఠశాల డైరెక్టర్ శ్రీ సిద్దాల శ్రీలత గారు మాట్లాడుతూ క్రిసాలిస్ యొక్క సొంత నాలుగు ఆలోచన కోణాలు అనగా లోతుగా చూడు, చుట్టూ చూడు ,లోపల చూడు మరియు దాటి చూడు అనే అంశాలు ప్రతి పాఠంలో ప్రతి సబ్జెక్టులో విద్యార్థుల ఆలోచనలు పెంపొందిస్తున్నాయని తెలియజేశారు.

చివరిగా తల్లిదండ్రుల సందేహాలను నివృత్తి చేస్తూ వారు ప్రతిపాదించిన సూచనలను నిర్వాహకులు స్వీకరించారు .క్యాంపస్ వాతావరణాన్ని ప్రత్యేకంగా చూసిన తల్లిదండ్రులు సంతోషాన్ని వ్యక్తం చేశారు .విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం కోసం రూపొందించిన కొత్త కార్యక్రమాలను ప్రిన్సిపల్ గారు శ్రీ ఎమ్ ఎల్ మరియన్ గారు పరిచయం చేశారు .ఇలాంటి కార్యక్రమాలు తరచుగా నిర్వహించడం ఆనందకరమని పాఠశాల డీన్ శ్రీ సతీష్ కుమార్ గారు అభిప్రాయపడ్డారు.

# ఏకపక్షం కాదు: హరీశ్

నాటి సీఎం కేసీఆర్ ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారంటూ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన ఆరోపణలను హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ పూర్తి వివరాలు ఆయన మాటల్లోనే..

**కుట్ర పూరిత విచారణ!**

కాళేశ్వరం ప్రాజెక్టులో ఎలాంటి రహస్యాలూ లేవు. అన్ని అంశాలు డీపీఆర్‌లో ఉన్నాయి. మేడిగడ్డ నుంచి మిడ్‌మానేరుకు నేరుగా తరలించలేమని నిపుణులు చెప్పారు. పీసీ ఘోష్ కమిషన్ విచారణ కుట్రపూరితంగా జరిగినట్లు కనిపిస్తోంది. కమిషన్ ఎదుట విచారణకు రావాలని మాకు నోటీసులు రాకమునుపే మీడియాలో లీకులు ఇచ్చారు. సంక్షిప్త నివేదిక పేరిట అవాస్తవాలు, రాజకీయ కక్ష సాధింపులతో 60 పేజీలు వండి వార్చారు. నచ్చిన పేరాల లీకులు, నచ్చని నాయకులు బాధ్యులు అన్నట్లుగా నివేదిక తీరు ఉంది. ఒక వైపే చూసి, విని, నిలబడి ఇచ్చిన నిరాధార నివేదిక ఇది. అసెంబ్లీలో 665 పేజీల పూర్తి నివేదికను పెడితే వాస్తవాలను నిగ్గు తేల్చేలా నిలదీసి చీల్చి చెండాడతాం.

**అనుమతుల్లేని 'కొడంగల్'కు ఎలా శంకుస్థాపన చేస్తారు?**

కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుమతులు ఇచ్చిన కేంద్ర ప్రభుత్వ సంస్థలను కూడా ఈ నివేదిక తప్పు పట్టింది. 11 కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలు ప్రాజెక్టును ఆమోదించాయి. ప్రాణహితకు జాతీయ హోదా ఇవ్వాలని కేసీఆర్ గతంలో ప్రధానికి లేఖ రాశారు. ఏ అనుమతులు లేని కొడంగల్ ఎత్తిపోతల పథకానికి రేవంత్ ఎలా శంకుస్థాపన చేశారు? దీనిపై కూడా అసెంబ్లీలో దుమ్ము దులిపి అన్ని ఆధారాలు బయట పెడతాం. కానీ మైక్ కట్ చేయకుండా, సభను వాయిదా వేసుకోకుండా వాస్తవాలు చెప్పే అవకాశం మాకు ఇవ్వాలి. గతంలో దేశంలో వేసిన అనేక కమిషన్ల తరహాలోనే ఈ కమిషన్ నివేదిక కూడా న్యాయస్థానం ముందు నిలవదు.

**ప్రాజెక్టును పూర్తి చేసేందుకే మేడిగడ్డకు మార్పు**

తుమ్మిడిహెట్టి వద్ద ఏ ప్రాతిపదికన గతంలో బరాజ్‌ను ప్రతిపాదించారో కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పాలి. అక్కడ నీటి లభ్యత లేదని సీడబ్ల్యూసీనే చెప్పింది. అందుకే మేడిగడ్డకు మార్చాం. ప్రతిపాదిత 165 టీఎంసీల్లో ఎగువ రాష్ట్రాల వాటా ఉంది. దాన్ని కాంగ్రెస్ దాచిపెట్టింది. ప్రాణహిత%-%చేవెళ్లకు హైడ్రాలజీ అనుమతి ఇచ్చినట్లు కాంగ్రెస్ చెప్తోంది. కానీ 152 మీ. ఎత్తులో బరాజ్ నిర్మించవద్దని మహారాష్ట్ర స్పష్టంగా చెప్పింది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు పూర్తి కావాలన్న ఉద్దేశంతోనే తుమ్మిడిహెట్టి నుంచి మార్చాం. తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తున నిర్మించేందుకు ఒప్పందం చేసుకున్నట్లు నిరూపిస్తే సీఎం పదవికి రాజీనామా చేస్తానని కేసీఆర్ సవాలు చేసినా నాటి టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పందించ లేదు.

**అప్పట్లో ఖర్చు చేసింది రూ.3,700 కోట్లే..**

గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.11 వేల కోట్లతో 32 శాతం ప్రాణహిత%-%చేవెళ్ల ప్రాజెక్టు పనులు పూర్తి చేసినట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి చెప్పాడు. కానీ ఈ ప్రాజెక్టు కోసం నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఖర్చు చేసిన మొత్తం రూ.3700 కోట్లే. అందులోనూ మొబిలైజేషన్ అడ్వాన్సుల పేరిట రూ.2 వేల కోట్లు ఖర్చు చేశారు. కేసీఆర్ వందేళ్ల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేశారు. నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకానికి ఏ అనుమతి ఉందని రేవంత్‌రెడ్డి కొబ్బరికాయ కొట్టిండు. డీపీఆర్ లేకుండానే రేవంత్‌రెడ్డి పనులు ప్రారంభించాడు. ఎలాంటి అనుమతులు లేకుండానే బిల్లులు కూడా చెల్లించారు. దీనికి ఒక్క అనుమతైనా ఉంటే ఉత్తమ్ చూపించాలి. కాళేశ్వరం కూలిందని ప్రచారం చేస్తున్న రేవంత్ గందమల్ల రిజర్వాయర్‌కు కొబ్బరికాయ కొట్టి, మల్లన్నసాగర్ నుంచి మూసీకి నీళ్లు తెస్తానని టెండర్లు పిలుస్తున్నాడు. కాళేశ్వరం తెలంగాణ వరప్రదాయని. ప్రజల గుండెల్లో కేసీఆర్ దేవుడిలా నిలుస్తారు.

**రాజకీయ కుట్రతోనే ఎన్‌డీఎస్‌ఏ నివేదిక**

గోదావరి నదిపై పోలవరం ప్రాజెక్టు మూడుసార్లు కుప్పకూలినా స్పందించని ఎన్‌డీఎస్‌ఏ మేడిగడ్డ బరాజ్‌లో చిన్న ఘటన జరగ్గానే వచ్చింది. రాజకీయ కుట్రతోనే నివేదిక ఇచ్చింది. మేడిగడ్డలో రెండు పిల్లర్లు కూలితే కేసీఆర్‌ను బాధ్యులుగా చేస్తున్న వారు పోలవరం కట్టిన ఎన్‌డీఎస్‌ఏ చైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్‌పై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు? పోలవరం కట్టిన ప్రధాని మోదీపై చర్య తీసుకుంటారా? శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగం కూలిన ఘటనకు సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ బాధ్యత వహించాలి.

**అధికారంలోకి రాగానే మరమ్మతులు చేస్తాం**

కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తి స్థాయిలో బాగుంది. ప్రాజెక్టు ద్వారా రెండు పంటలు పండాయి. సుందిళ్ల, అన్నారం బరాజ్‌లు సురక్షితంగా ఉన్నాయని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అసెంబ్లీ వేదికగా చెప్పాడు. మేడిగడ్డలో రెండు పియర్లు కుంగితే కాళేశ్వరం కూలిందని తప్పుడు ప్రచారం చేశారు. బీఆర్‌ఎస్ తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత కుంగిన రెండు పియర్లను బాగు చేసి కాళేశ్వరం ప్రాజెక్టును తెలంగాణకు వరప్రదాయని అని నిరూపిస్తాం.

## చిన్న సాయమైనా కష్టాల్లో ఉన్న కుటుంబానికి కొండంత అండ: సీఎం చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్‌లో పేదరికంపై సరికొత్త యుద్ధానికి రాష్ట్ర ప్రభుత్వం తెరలేపిందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు మానవతావాదుల భాగస్వామ్యాన్ని జోడిస్తూ 'పీ4' (ప్రజల భాగస్వామ్యంతో పురోగతి, పేదరిక నిర్మూలన) అనే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని వెల్లడించారు. 2029 నాటికి రాష్ట్రాన్ని శూన్య పేదరిక రాష్ట్రంగా మార్చడమే లక్ష్యంగా, ఆగస్టు 19వ తేదీ నుంచి ఈ వినూత్న కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్నట్లు నేడు ప్రకటించారు. మంగళవారం సచివాలయంలో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో సీఎం ఈ కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ పథకాల ద్వారా ఆర్థిక చేయూత అందుతున్నా, కొన్ని కుటుంబాలకు నైపుణ్యం, మార్గనిర్దేశం, మానసిక స్థైర్యం వంటి అదనపు తోడ్పాటు అవసరమని, ఆ లోటును 'మార్గదర్శకులు' భర్తీ చేస్తారని ఆయన అన్నారు.

**హేమలతే నిజమైన మార్గదర్శి!**

ఈ కార్యక్రమ స్ఫూర్తికి అసలైన నిర్వచనం చెప్పడానికి ముఖ్యమంత్రి అవనిగడ్డకు చెందిన పారిశుద్ధ్య కార్మికురాలు హేమలత ఉదంతాన్ని ఉటంకించారు. "ఆమె ఆర్థికంగా నిరుపేద. అయినా తనకంటే కష్టాల్లో ఉన్న ఓ వృద్ధురాలికి అండగా నిలబడింది. రోజూ ఆమె ఇంటికెళ్లి సపర్యలు చేస్తోంది. ఇంతకంటే గొప్ప మానవత్వం ఏముంటుంది? డబ్బున్న వారే దానం చేయాలనేమీ లేదు. ఆదుకోవాలనే సంకల్పం ఉన్న ప్రతి ఒక్కరూ మార్గదర్శి కావచ్చు. హేమలత లాంటి వారే ఈ కార్యక్రమానికి నిజమైన స్ఫూర్తి ప్రదాతలు," అని సీఎం భావోద్వేగంతో ప్రశంసించారు.

**స్వచ్ఛందమే... ఒత్తిడికి తావులేదు!**

సమాజంలో స్థిరపడిన వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పేదరికంలో మగ్గుతున్న 'బంగారు కుటుంబాల'కు చేయూతనివ్వడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని సీఎం స్పష్టం చేశారు. మార్గదర్శుల ఎంపికలో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు, బలవంతాలకు తావుండకూడదని అధికారులకు గట్టిగా సూచించారు. "ఇది మానవత్వంతో ముడిపడిన కార్యక్రమం. మనసున్న వారే ముందుకు వస్తారు. గతంలో జన్మభూమి వంటి కార్యక్రమాలను విమర్శించినట్లే, దీన్నీ కొందరు నీరుగార్చాలని చూస్తారు. వాటిని పట్టించుకోవద్దు" అని ఆయన హితవు పలికారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, పీ4 ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.



## కాళేశ్వరం కమిషన్ నివేదిక ట్రాష్, గ్యాస్

న్యూఢిల్లీ: ఈవీఎంలు వద్దు పేపర్ బ్యాలెట్ విధానాన్ని తిరిగి ప్రవేశ పెట్టాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఎన్నికల నిర్వహణ, సంస్కరణలపై అన్ని రాజకీయ పార్టీలతో కేంద్ర ఎన్నికల సంఘం సమావేశాలు నిర్వహిస్తుంది. ఇందులో భాగంగా ఢిల్లీలో ఈసీ సమావేశానికి బీఆర్‌ఎస్ నుంచి కేటీఆర్‌తో పాటు ఇతర పార్టీ నేతలు హాజరయ్యారు. ఈసీతో సమావేశం అనంతరం, కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. 'పేపర్ బ్యాలెట్ విధానాన్ని తిరిగి ప్రవేశపెట్టాలి. బీహార్ ఎన్నికల నుంచే పేపర్ బ్యాలెట్‌తో ఎన్నికల జరపాలి. ఈవీఎంలపై అనేక అనుమానాలు ఉన్నాయి. అనేక దేశాలు బ్యాలెట్ విధానంతోనే ఎన్నికలు నిర్వహిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలపై బాండ్ పేపర్లతో ప్రజలను వంచించింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉండకపోతే ప్రజలు శిక్షించేలా ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలి. హామీలు నెరవేర్చకపోతే సభ్యత్వం రద్దు చేయాలి. బీహార్ ప్రత్యేక ఓటర్ సవరణ పై కూడా చర్చ జరిపాం. ఓటర్లను ఉద్దేశపూర్వకంగా తీసేయలేదు అని ఎన్నికల సంఘం చెప్పింది. ఓటరు జాబితా సవరణ మంచిదే కానీ అందరి విశ్వాసాన్ని పరిగణలోకి తీసుకొని చేయాలి. అన్ని పార్టీలను భాగస్వామ్యం చేయాలని పిలుపునిచ్చారు. అదే సమయంలో కాళేశ్వరం కమిషన్ నివేదికపై చర్చించేందుకు జరగనున్న తెలంగాణ అసెంబ్లీ సమావేశాలపై స్పందించారు. కాళేశ్వరం కమిషన్ నివేదిక ట్రాష్, గ్యాస్. కాళేశ్వరం కమిషన్ నివేదికలో 650 పేజీల్లో ఉన్న నివేదికను 60 పేజీల్లోకి కుదించి అసెంబ్లీలో పెడతామని అంటున్నారు.అసెంబ్లీలో మైకు కట్ చేయకుండా ఉంచితే కాంగ్రెస్ ను చీల్చి చెండాడుతాం.దురుద్దేశంతో మాపై ప్రచారం చేస్తున్నారు. కేసీఆర్ ,బీఆర్ఎస్‌పై దుష్ప్రచారం. మొత్తం నివేదికను బయట పెట్టాలి.అసెంబ్లీలో నివేదిక పెట్టాలి.బీసీల కు ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చెయ్యడం లేదు. సబ్ ప్లాన్ ఎందుకు పెట్టరు. మీ చేతుల్లో ఉన్న పనులు ముందు చెయ్యండి. ఢిల్లీలో డ్రామా లు చేస్తే ఎవ్వరు నమ్మరు'అని ఎద్దేవా చేశారు.

# న్యాయవ్యవస్థనే అవమానిస్తారా?: మంత్రి ఉత్తమ్



## మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఫైర్

హైదరాబాద్: 'ప్రజాస్వామ్య వ్యవస్థలపై బీఆర్‌ఎస్‌కు చులకన భావం. చట్టసభలు, న్యాయ వ్యవస్థపై గౌరవం, నమ్మకం లేదు. సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి సారథ్యంలోని జ్యుడీషియల్ కమిషన్ అంటే కూడా లెక్కలేదు. ప్రజలు గత ఎన్నికల్లో బుద్ధి చెప్పినా ఇప్పటికీ వాళ్లలో మార్పు రాలేదు. మేడిగడ్డను కుంగబెట్టిన దుర్మార్గులు ఇప్పుడు ఏకంగా సీనియర్ జస్టిస్ పీసీ ఘోష్‌ను అవమానిస్తున్నారా? న్యాయబద్ధ కమిషన్‌కు అపార్థాలు అంటగట్టే నీచానికి దిగజారటం కూడా మీకే చెల్లింది..' అని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు. కమిషన్ నివేదికపై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు చేసిన ఆరోపణలను ఖండిస్తూ మంగళవారం రాత్రి ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

**వారి బండారం బట్టబయలైంది**

'కాళేశ్వరం ప్రాజెక్టు పేరిట గత ప్రభుత్వం ఎన్ని అవకతవకలకు, అక్రమాలకు పాల్పడిందో కమిషన్ విచారణలో బయటపడింది. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, ఆనాటి ఇరిగేషన్ మంత్రి హరీశ్‌రావు బండారం బట్టబయలైంది. అందుకే తేలు కుట్టిన దొంగల్లా.. హరీశ్‌రావు మళ్లీ కల్ల'ల్లి కబుర్లు చెప్తున్నారు. కమిషన్ ఇచ్చిన నివేదికలోని అంశాలను మాత్రమే ప్రభుత్వం వెల్లడించింది. అది రేవంత్‌రెడ్డి ఉత్తమ్‌కుమార్ రెడ్డి రాసిన రిపోర్టు కాదనే విషయాన్ని హరీశ్‌రావు మరిచిపోయినట్లున్నారు.

**ఇంకెన్ని సార్లు మోసం చేస్తారు..**

కాళేశ్వరం ప్రాజెక్టు ఆలోచన మొదలైనప్పటి నుంచి డిజైన్లు, నిర్మాణంలో లోపాలు, మేడిగడ్డ బరాజ్ కుంగుబాటు వరకు అవకతవకలన్నింటిపై కమిషన్ సమగ్రంగా విచారణ జరిపింది. ఎవరెవరు తప్పులు చేశారో.. ఎవరెవరు అందుకు బాధ్యులనే వివరాలను నివేదికలో వెల్లడించింది. మేమేం తప్పు చేయలేదంటూ మీ పార్టీ ఆఫీసులో తప్పులు మాట్లాడి తెలంగాణ ప్రజలను ఇంకెన్ని సార్లు మోసం చేస్తారు? ఇప్పుడు పార్టీ ఆఫీసులో పెడబొబ్బలు పెడుతున్న హరీశ్‌రావు.. ఆరోజు కమిషన్ ముందు ఎందుకు ఈ వివరాలు చెప్పుకోలేదు?..' అని ఉత్తమ్ నిలదీశారు.

**ప్రభుత్వం చర్యలపై భయం పట్టుకుంది..**

'హరీశ్ అబద్ధపు సాక్ష్యాలు, బుకాయింపులన్నీ.. న్యాయ వ్యవస్థ ముందు అబద్ధాలుగా తేలిపోయాయి. ఆయన చేసిన తప్పులన్నీ బయటపడ్డాయి. కేసీఆర్ పాత్ర ఏమిటో, హరీశ్‌రావు చేసిన ఘనకార్యాలేమిటో కమిషన్ విచారణలో తేలిపోయాయి. దాంతో ఇప్పుడు ప్రభుత్వం ఈ నివేదికపై ఎలాంటి చర్యలు తీసుకుంటుందనే భయం వాళ్లను వెంటాడుతోంది. అందుకే కమిషన్‌ను తప్పుబట్టే దుర్మార్గానికి ఒడిగట్టారు.

**అసెంబ్లీలో చర్చించేందుకు సిద్ధం**

ప్రజాస్వామ్య వ్యవస్థలు, న్యాయ వ్యవస్థలు, చట్ట సభలపై మా ప్రభుత్వానికి గౌరవముంది. అందుకే అసెంబ్లీలో ఈ నివేదికపై చర్చించేందుకు సిద్ధంగా ఉంది. కాళేశ్వరంలో దోషులుగా తేలిన బాధ్యులు.. అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొనాలని కూడా ప్రభుత్వం ఆహ్వానించింది. ఫార్మ్ హౌస్‌లో మామ డైరెక్షన్, పార్టీ ఆఫీస్‌లో అల్లుడి యాక్టింగ్ ఇకనైనా ఆపాలి. ఇప్పటికైనా అసెంబ్లీకి వచ్చి చేసిన తప్పులు ఒప్పుకుని నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పుకోవాలి. మీరు వేలకోట్ల అవినీతి చేస్తే ఒప్పు,.. మేం విచారణ చేసి నిజాలు నిగ్గుతేలిస్తే అది రాజకీయ కక్ష సాధింపా?..' అని మంత్రి ప్రశ్నించారు.

**బీఆర్ఎస్ నేతలకు మాట్లాడే హక్కే లేదు..**

'కమీషన్ల కక్కుర్తితో ప్రజలను, రైతులను పదేళ్ల పాటు మోసం చేశారు, ప్రాణహిత%-%చేవెళ్ల ప్రాజెక్టుకు హైడ్రాలజీ అనుమతులు ఇస్తే దాచిపెట్టారు. నిపుణుల కమిటీ మేడిగడ్డ వద్ద బరాజ్‌ల నిర్మాణం వద్దని చెపితే తొక్కిపెట్టారు. బరాజ్‌లు ఎక్కడ కట్టాలో మీరే నిర్ణయించుకున్నారు. కుంగి పోయే ప్రాజెక్టు కట్టినందుకు సిగ్గుపడాల్సింది పోయి హరీశ్‌రావు కొత్త రికార్డు సృష్టించారు. జనం చెవిలో పువ్వులు పెట్టే ప్రయత్నం చేశారు. ఒక్క మాట కూడా నిజం చెప్పకుండా మరోసారి డూప్ ప్రజెంటేషన్ ఇచ్చారు. నారాయణపేట కొడంగల్ ప్రాజెక్టుకు ఉమ్మడి రాష్ట్రంలోనే జీవో ఇచ్చారు. మా ప్రభుత్వం ఒక్క రూపాయి బిల్లు కూడా ఇప్పటివరకు ఆ ప్రాజెక్టు కాంట్రాక్టర్లకు ఇవ్వలేదు. కేబినెట్ ఆమోదం లేకుండానే మామా అల్లుళ్లు సంతకాలు చేసుకుని కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి.. తెలంగాణ ప్రజలను దగా చేశారు. తెలంగాణ ప్రయోజనాలను పాతరపెట్టి, ఆర్థికంగా లక్ష కోట్ల దుర్మార్గానికి ఒడిగట్టిన బీఆర్‌ఎస్ నేతలకు నైతికంగా మాట్లాడే హక్కే లేదు..' అని ఉత్తమ్ విమర్శించారు.



## తల్లిపాల వారోత్సవాలలో పిల్లల ఆరోగ్య పరిశుభ్రత పై అవగాహన కార్యక్రమం

మిర్యాలగూడ ఆగస్టు 5:- (వార్త మిర్రర్) తల్లిపాల వారోత్సవాలలో భాగంగా మిర్యాలగూడ అర్బన్ ప్రాజెక్ట్ పరిధిలోగల గాంధీనగర్ సెక్టార్ శాబునగర్ అంగన్వాడి కేంద్రంలో మంగళవారంఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ రేఖల మమత ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ నజీమా బేగం. మహమ్మద్ మాట్లాడుతూ ప్రసవించిన తర్వాత వచ్చే ముర్రుపాలను బిడ్డకు గంటలోపు పట్టించాలని, ముర్రు పాలలో కొలెస్ట్రాల్ ఉంటుందని పాలు త్రాగించడం వలన బిడ్డకు రోగనిరోధక శక్తి మెరుగుపడుతుందని ముర్రు పాలు బిడ్డకు మొదటి టీకాతో సమానమన్నారు. బిడ్డకు 6 నెలలు వచ్చేంతవరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని ఎటువంటి ద్రవ పదార్థాలు ఇవ్వకూడదని తెలిపారు. గృహ సందర్శనలో6 నెలలు నిండిన తర్వాత బిడ్డకు తల్లిపాలు కొనసాగిస్తూ అనుబంధ ఆహారం మొదలు పెట్టాలని వివరించారు. పిల్లలకు హైజినిక్ గురించి వివరిస్తూ హ్యాండ్ వాష్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ శివలీలా, మాధవి, లత, షాహిదా, పిల్లలు, తల్లులు, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు



## ఆలగడప ప్రాధమిక ఆరోగ్య కేంద్రంలో తల్లిపాల వారోత్సవం

మిర్యాలగూడ ఆగస్టు 5:- (వార్తమిర్రర్) : తల్లి పాలకున్న ప్రాధాన్యత మహిళల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ కేసా రవి అన్నారు. మిర్యాలగూడ ఐసిడిఎస్ అర్బన్ ప్రాజెక్టు పరిధి మిర్యాలగూడ మండలం ఆలగడప ప్రాధమిక ఆరోగ్య కేంద్రంలో ప్రాజెక్టు ఆఫీసర్ రేఖల మమత ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన తల్లి పాలవారోత్సవాలలో ఆయన మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపు తల్లిపాలు పట్టిస్తే బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఆ దిశగా అంగన్వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఆలగడప ప్రాధమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎస్కె.మోయిద్ మాట్లాడుతూ గర్భిణీలందరూ హాస్పిటల్లో ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. తల్లి బిడ్డ ఆరోగ్యం కోసం కలిసి పని చేయాలన్నారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ బి.రాధిక మాట్లాడుతూ గర్భిణీలందరూ అంగన్వాడి కేంద్రంలో అందించే పోషకాహారం తీసుకుంటూ ప్రసవించిన గంటలోపు బిడ్డకి ముర్రుపాలు పట్టాలన్నారు. అదేవిధంగా 6 నెలలు వచ్చిన తర్వాత తల్లిపాలు కొనసాగిస్తూ అనుబంధ పోషకాహారం పెట్టాలి, ఈ విధంగా బిడ్డకి 2 సంవత్సరాలు వచ్చే వరకు తల్లి పాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పిహెచ్ఎన్ స్వరూపరాణి, హెల్త్ సూపర్వైజర్ మంగమ్మ, విజయ, సరిత, ఏఎన్ఎం, ఆశాలు అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

## బీసీల 42% రిజర్వేషన్ కై జంతర్ మంతర్ ధర్నాకు బయలెల్లిన శాసనసభ్యులు

### భువనగిరి నకిరేకల్ ఎమ్మెల్యేలు కుంభం అనిల్ కుమార్ రెడ్డి - వేముల వీరేశం



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి : తెలంగాణ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ల అమలుకై (టి పి సి సి) ఆధ్వర్యంలో ఢిల్లీలో మూడు రోజుల ఉద్యమం 5 6 తేదీలలో ఢిల్లీ కేంద్రంగా బీసీ లకు 42 శాతం రిజర్వేషన్ ల పోరాటంకై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టిపిసిసి మహేష్ కుమార్ గౌడ్, ఆధ్వర్యంలో ఆగస్టు 5 పార్లమెంట్లో బీసీ రిజర్వేషన్ల ఆశయంపై చర్చించేందుకు వాయిదా తీర్మానానికి (టీ పి సి సి) నేతల పోరాటంకై, ఆగస్టు 6 ఢిల్లీ జంతర్ మంతర్ ధర్నాలో పాల్గొనడానికి భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం, భువనగిరి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పాశం శివానంద్, బండ సోమారం మాజీ సర్పంచ్ నామం పద్మ- కృష్ణ గౌడ్ ఢిల్లీ బయలుదేరారు,



## అథ్లెటిక్ మీట్ 20 రన్నింగ్ రేసులో గోల్డ్ మెడల్ సాధించిన తపస్వి స్కూల్ విద్యార్థులు

### గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థులను అభినందించిన తపస్వి స్కూల్ చైర్మన్ ప్రదీప్ కుమార్

ఎల్బీనగర్,5 ఆగస్టు: వనస్థలిపురం డివిజన్ పరిధిలోని చింతలకుంట రేడియో కాలనీ లో గల తపస్వి స్కూల్ విద్యార్థులు క్రీడలలో చక్కటి ప్రతిభను కనబరిచారు. రంగారెడ్డి జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అథ్లెటిక్ 20 లో రన్నింగ్ రేస్ ను సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో మంగళవారం నిర్వహించారు. ఈ రన్నింగ్ రేసులో పాల్గొన్న తపస్వి స్కూల్ విద్యార్థులు మౌర్య నాయక్ గోల్డ్ మెడల్, జావలిన్ త్రీ విభాగంలో రెండు బ్రాంజ్ మోడల్స్ సాధించి తమ ప్రతిభను చాటుకున్నారు. క్రీడలలో చక్కటి ప్రతిభను కనబరిచిన విద్యార్థులను తపస్వి స్కూల్ చైర్మన్ గొరిగే ప్రదీప్ కుమార్ శాలువాతో ఘనంగా సత్కరించి వారిని అభినందిస్తూ రాబోయే కాలంలో ఇంకా ఉన్నత స్థాయికి చేరుకొని రాష్ట్ర, దేశ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు సాధించాలని ఆశీర్వదించారు. విద్యార్థులు విద్యాతో పాటు క్రీడలలో కూడా రాణించి తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు. క్రీడలు విద్యార్థులకు శారీరకంగా మానసికంగా ఎంతగానో ఉపయోగపడతాయని మెడల్స్ సాధించిన సందర్భంగా ఆయన సంతోషం వ్యక్తం చేశారు. గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థి మౌర్య నాయక్ ఆగస్టు 7న జనగామ జిల్లాలో జరగబోయే రాష్ట్రస్థాయి రన్నింగ్ రేస్ కాంపిటీషన్ కి ఎంపికైనట్లు స్కూల్ చైర్మన్ ప్రదీప్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ కె.లింగం కయాదవ్, స్కూల్ ప్రిన్సిపాల్ రత్న తదితరులు పాల్గొన్నారు.

# మునుగోడు ప్రజల కోసం అవసరమైతే తాను మళ్లీ పదవి త్యాగం చేస్తా!

**మంత్రి పదవి ఇస్తానని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది ...**
**మాట నిలబెట్టుకోకపోవడం వారి ఖర్మ..!**

**ముఖ్యమంత్రి పదవి ఫోర్త్ సిటీ పేరుతో నిధులు**
**రేవంత్ రెడ్డి కైనా.! నా మునుగోడు అభివృద్ధిని పట్టించుకోరా.!**

**మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సంచలన వాక్యాలు**





యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధియాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం లచ్చమ్మ గూడెం లో 33/11 కేవీ సబ్ స్టేషన్ ను ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మునుగోడు ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజ కవర్గం లో మరో 19 సబ్ స్టేషన్ ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. సబ్ స్టేషన్ ప్రారంభంతో లో వోల్టేజ్ సమస్యకు పరిష్కారం లభించిందని అన్నారు.నియోజకవర్గంలో 132 కేవీ సబ్ స్టేషన్ లు మరో రెండు ఏర్పాటు చేయడంతో పూర్తిగా విద్యుత్ సమస్య పరిష్కారం లభిస్తుందని అన్నారు. గత ప్రభుత్వంలో నియోజకవర్గం మొత్తం సమస్యలకు నిలయంగా మారిందని,తాను ఎమ్మెల్యే అయినాక సమస్యల పరిష్కారంపై దృష్టి సారించానని అన్నారు. నియోజకవర్గంలో ప్రధానమైన విద్యా,వైద్యం,విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నానని తెలిపారు.తాను ఎమ్మెల్యేగా గెలవడానికి కమ్యూనిస్ట్ లు కీలకం అని అదేవిధంగా కమ్యూనిస్టులకు ఎమ్మెల్సీ రావడంలో కాంగ్రెస్ పార్టీ పాత్ర అంతేనని అన్నారు.నాకు తోడుగా ఎమ్మెల్సీ తమ్ముడు సత్యం ఉన్నాడని ఇద్దరం కలిసి నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందు తీసుకువెళ్తామని అన్నారు.ఎల్ బి నగర్ నుండి పోటీ చేస్తే నాకు మంత్రి పదవి వచ్చేదని కానీ మునుగోడు ప్రజల కోసమే పనిచేస్తానని,పదవి కోసం పైరవీలు చేసేవాడిని కాదన్నారు.నాకు మంత్రి పదవి వస్తే ప్రజలకే ఉపయోగం అని, నాకు మంత్రి పదవి ఇస్తానని హామీ ఇచ్చారు ఇస్తే ఇవ్వండి లేకుంటే లేదన్నారు అవసరమైతే మునుగోడు ప్రజల కోసం ఎమ్మెల్యే పదవిని త్యాగం చేస్తా అన్నారు, పదవి ఫోర్త్ సిటీ పేరుతో నిధులని రేవంత్ రెడ్డి కేనా అని మండిపడ్డారు, కొత్తవారికి మంత్రి పదవులు వచ్చాయి సీనియర్ కాంగ్రెస్ నాయకులు అనగదొక్కుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

## కాంగ్రెస్‌కు షాక్.. బీఆర్ఎస్‌లో భారీ చేరికలు

### తెలంగాణ ప్రజలు మోసం చేసిన రేవంత్ సర్కార్

### కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్



కల్వకుర్తి ఆగస్టు 5 వార్త మిర్రర్ ప్రతినిధి:- తెలంగాణలో అధికారం చేజించుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్న కాంగ్రెస్ పార్టీ అబద్ధపు ప్రచారాలు, దొంగ హామీలు ఇచ్చి తెలంగాణ ప్రజలను మోసం చేశారని కల్వకుర్తి మాజీ శాసనసభ్యులు జైపాల్ యాదవ్, కడ్తాల్ మాజీ జెడ్పిటిసి దశరథ్ నాయక్ మండిపడ్డారు. మంగళవారం, కడ్తాల్ మండల కేంద్రంలో దశరథ్ నాయక్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో పలు పార్టీలకు చెందిన పలువురు సీనియర్ నాయకులకు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిని మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారం దక్కించుకోవడానికి ఆచరణకు సాధ్యం కానీ హామీలు ఇచ్చిన కాంగ్రెస్ డైవర్షన్ పాలిటిక్స్ తో పబ్బం గడుపుతుందని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ అమలు చేసిన పథకాలు దేశానికి ఆదర్శమైతే, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆ పథకాలను తుంగలో తొక్కేసిందని మండిపడ్డారు. కెసిఆర్ తెలంగాణను అభివృద్ధి చేసిన తీరుపట్ల ఆకర్షితులై పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరడం చూస్తుంటే రానున్న స్థానిక ఎన్నికల్లో విజయం సాధించినట్లే అని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మీనరసింహారెడ్డి కృష్ణయ్య గ్రామ కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ ప్రవీణ్ కుమార్ నాయకులు సుదర్శన్ రెడ్డి శ్రీశైలం యాదవ్ శివ యాదవ్ నరసింహ జైపాల్ రెడ్డి రమేష్ రాములు వెంకటేష్ శ్రీకాంత్ చరణ్ బిక్షపతి మహేష్ నాయకులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తా

### ఐజేయు జిల్లా అధ్యక్షుడు చీటి శ్రీనివాస్.






వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఆగస్టు 5

జిల్లాలోని జర్నలిస్టుల సంక్షేమానికి అన్ని విధాలుగా కృషి చేస్తానని ఐజేయు జగిత్యాల జిల్లా అధ్యక్షుడు చీటి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. మంగళవారం రాయికల్ పట్టణంలోని మార్కండేయ పద్మశాలి సంఘం భవనంలో జేఏసీ ఆధ్వర్యంలో ఐజేయు నూతన జిల్లా కార్యవర్గానికి ఘన సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చీటి శ్రీనివాస్ మాట్లాడుతూ, “జర్నలిస్టులకు రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం, ఆరోగ్య కార్డులు, బీమా వంటివి అందించేందుకు కృషి చేస్తాను. జర్నలిస్టులు ప్రజల సమస్యలను ప్రభుత్వానికి తెలియజేసే వారధిలా పనిచేస్తున్నారు. కానీ వారి సమస్యలు మాత్రం ఇంకా పరిష్కారం కావడం లేదు. వాటిని అధికారులకు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాను,” అని అన్నారు. రాయికల్‌కి చెందిన జర్నలిస్టులు ఐక్యతతో ఉన్నందుకు అభినందించిన ఆయన, ఇతర ప్రాంతాల్లో కూడా ఇది ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బెజ్జంకి సంపూర్ణ చారి, ఉపాధ్యక్షులు గడ్డల హరికృష్ణ, అల్లె రాము, సంయుక్త కార్యదర్శి గుర్రం చంద్రశేఖర్, కోశాధికారి సిరిసిల్ల వేణుగోపాల్, జిల్లా కార్యవర్గ సభ్యులు నాగిరెడ్డి రఘుపతి, ఇందూరి నరేష్, బూరం లక్ష్మణ్, పెరంబుదూరు శ్రీకాంత్, రాయికల్ ప్రెస్ జేఏసీ అధ్యక్షుడు వాసరి రవి, ప్రధాన కార్యదర్శి కడకుంట్ల జగదీశ్వర్, సాంస్కృతిక కార్యదర్శి డాక్టర్ ఏ.ఎం. రాజు రెడ్డి, సంయుక్త కార్యదర్శి గంగాధరి సురేష్, సీనియర్ పాత్రికేయులు సింగిడి శంకర్, ముజాఫర్, బొంగోని శ్రీనివాస్, సింగని శ్యాంసుందర్, వాసం లింబాద్రి, తిరుమల శంకర్, ఓరుగంటి భీమరాజం, చింతకుంట సాయికుమార్, ఇమ్మడి విజయ్, కిరణ్ రావు, ఉరుమడ్ల సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

## చీర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనాధ ఆశ్రమంలో 60 మంది పేద విద్యార్థులకు చేయూత

### అనాధ పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తా...

### షేర్ ద విజన్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు నారాయణరావు





హైదరాబాద్ వార్త మిర్రర్ ప్రతినిధి : కూకట్పల్లిలోని అనాథ పేద పిల్లలకు స్కూల్ కిట్స్ పంపిణీ చేసిన షేర్ ద విజన్అధ్యక్షుడు నారాయణరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ అనాథ పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి తమ సంస్థ సహకారం అందిస్తుందని. హైదరాబాదు కూకట్పల్లిలో చీర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనాథ బాలల ఆశ్రమంలోని 60 మంది విద్యార్థులకు రూ ఒక లక్ష విలువైన స్కూల్ కిట్స్, నిత్యావసర సరుకులను ఆయన మంగళవారం పంపిణీ చేసి మాట్లాడారు. సమాజంలో అందరికీ చదువుకునే అవకాశం ఉండాలని అన్నారు. పేదరికం మూలంగా, ఆదరించే వారు లేకపోవడంతో చాలామంది చదువుకు దూరం అవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తాము సంపాదించిన దాంట్లో కొంత పోగుచేసి పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి సహకారం అందించాలని షేర్ ద విజన్ సంస్థను స్థాపించామని వెల్లడించారు. ప్రతి ఒక్కరూ విద్యాభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని కోరారు. చదువుకున్న సమాజంతోనే కుటుంబం దేశం అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో షీర్స్ ఫౌండేషన్ నిర్వాహకుడు అశోక్, అనాధ ఆశ్రమ నిర్వాహకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు

## మిర్యాలగూడకు చేరుకున్న ఎస్ఎఫ్ఐ సంఘర్షణ సైకిల్ యాత్ర

### స్వాగతం పలికిన సిఐటియు, ఐద్వా, డివైఎఫ్ఐ నాయకులు



మిర్యాలగూడ , ఆగస్టు 5:-( వార్త మిర్రర్) : విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన సంఘర్షణ సైకిల్ యాత్ర మంగళవారం సాయంత్రం మిర్యాలగూడకు చేరుకుంది. పట్టణంలోని సుందరయ్య చౌరస్తా వద్ద సైకిల్ యాత్రకు సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డబ్బికార్ మల్లేష్, ఐద్వా, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పోలేబోయిన వరలక్ష్మి, రవినాయక్ స్వాగతం పలికారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ రాజీ లేని పోరాటాలు చేస్తుందన్నారు. ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్ స్కాలర్షిప్లను విడుదల చేయాలని, మెస్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు గోవర్ధన, అరుణ, డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు పతాని శ్రీనివాస్, ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యులు కమ్మంపాటి శంకర్, జిల్లా అధ్యక్షులు నరేష్ నాయకులు సైదానాయక్, జగన్నాయక్, వీరన్న, రవీందర్, రమేష్, కావ్య, కిరణ్, స్పందన, ప్రసన్న, సంతోష్ పాల్గొన్నారు.



# కిష్టంపేట అంగన్వాడీలో తల్లిపాల వారోత్సవాలు

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఆగష్టు 5 : తల్లిపాల వారోత్సవాల సందర్భంగా జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కిష్టంపేట గ్రామంలో అంగన్వాడి కేంద్రం లో ఆగస్టు 01-08-2025 నుండి 07-08-2025 తేదీ వరకు జరుగు తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా ఆరు నెలలు నిండిన బాబుకి, పాపకి అన్నప్రాసన నిర్వహించడం జరిగింది..... ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్ లు దివ్య, అన్నపూర్ణ మాట్లాడుతూ తల్లిపాల ప్రాముఖ్యత గురించి మరియు బిడ్డ పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలను పట్టించాలని ముర్రుపాలలో బిడ్డకు కావలసినంత వ్యాధినిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని, ఆరు నెలలు నిండే వరకు తల్లిపాలను మాత్రమే ఇవ్వాలని, ఆరు నెలలు నిండిన తర్వాత తల్లిపాలతో పాటు అదనపు ఆహారాన్ని ఇవ్వాలని ఆమె చెప్పారు.. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు మ్యాకల దివ్య, అన్నపూర్ణ, ఆయాలు, గర్భవతులు, బ్యాలెంతలు, పిల్లల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## రాయితీ పై లభించే వ్యవసాయ యంత్ర పరికరాలు

### రైతులు ఈ అవకాశన్ని సాధ్వనియోగం చేసుకోవాలి

### రాయికల్ మండల వ్యవసాయ అధికారి కే ముక్తీశ్వర్



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఆగష్టు 5 : ప్రభుత్వ వ్యవసాయ యాంత్రీకరణ ఉప పథకం కింద రైతులకు రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు అందజేయడం జరుగుతుంది. ఈ పథకంలో భాగంగా రాయికల్ మండలానికి బ్యాటరీ ఆపరేట్ స్ప్రేయర్ -246,క్నాప్సాక్ హ్యాండ్ స్ప్రేయర్ బి 40,సీడ్ కం ఫెర్టిలైజర్ డ్రిల్ - 3,బ్రష్ కట్టర్ బి 03,పవర్ టిల్లర్ బి 02,రోటావేటర్ బి 12, స్ట్రా బాయిలర్ బి 03,పవర్ వీడర్ బి 01, డిస్కో హారో, ఎంబి ప్లావు, బి17,బండు ఫార్మర్ -01పరికరాలు అందుబాటులో కలవు. సన్న, చిన్న కారు, ఎస్సీ, ఎస్టీ, మహిళా రైతులకు 50% రాయితీ, మిగతా రైతులకు 40% రాయితీ పొందవచ్చునని తెలిపారు. ఆసక్తి గల రైతులు దరఖాస్తు ఫారం, పాస్పోర్ట్ సైజ్ ఫోటో, ఆధార్ కార్డు జిరాక్స్, పట్టాదారు పాస్ బుక్ జిరాక్స్, ట్రాక్టర్లతో నడిపే యంత్రాలకు ట్రాక్టర్ ఆర్ సి బుక్ జిరాక్స్, డిడి వివరాలతో ఈ నెల 12వ తారీకు లోపు మండల వ్యవసాయ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోగలరని, రాయికల్ మండల వ్యవసాయ అధికారి కే ముక్తీశ్వర్ ఒక ప్రకటనలోతెలియజేసారు.



## న్యాయవాదులకు క్రీడల పోటీలు ప్రారంభించిన ఐదో అదనపు జిల్లా జడ్జి వేణు

మిర్యాలగూడ , ఆగస్టు 5:-( వార్త మిర్రర్) మిర్యాలగూడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించికొని బార్ అసోసియేషన్ అధ్యక్షులు నేతి సత్యనారాయణ ఆధ్వర్యంలో క్యారం బోర్డ్, చెస్ తదితర క్రిదలను ముఖ్య అతిధి ఐదో అదనపు జిల్లా జడ్జి జి.వేణు ప్రారంభించారు. ప్రతి జాతీయ పండగల సందర్భంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బందికి క్రీడల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి సుజయ్, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి అరుణ్ తేజ్, గేమ్స్ సెక్రటరీ కొంక వెంకన్న, ఉపాధ్యక్షులు ఎన్. శ్రీనివాస్, పద్మయ్య, గంగాభవాని, కస్తూరి నాగేందర్, ఎండి.ఇబ్రహీం, జె.శ్రీనివాస్, పూసపాటి పరమేష్, రాయారపు భాస్కర్ నాయుడు, అలుగుబెల్లి భూపతిరెడ్డి, స్వరాజ్యం. ఆస్మా, నాగరజు, కిరణ్ పాల్గొన్నారు.



## మున్నూరుకాపు సంఘం తెలంగాణ గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షులుగా గర్ష మోహన్ పటేల్

సికింద్రాబాద్, వార్త మిర్రర్ ఆగస్టు 5 (సాక్ష్యం)... మున్నూరుకాపు సంఘం తెలంగాణ రాష్ట్ర స్థాయి సమావేశం నగరంలోని రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు వనవల ప్రవీణ్ కుమార్ పటేల్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో మున్నూరు కాపు సంఘం తెలంగాణ గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షులుగా సికింద్రాబాద్ లాల పేటకు చెందిన గర్ష మోహన్ పటేల్ ను నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు యువత రాష్ట్ర అధ్యక్షులు బండి సంజీవ్ పటేల్. మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ చింతపండు మహేందర్ పటేల్, మున్నూరు కాపు యువత రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యాదా క్రాంతి పటేల్,మున్నూరు కాపు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారి అనిల్ పటేల్, మున్నూరుకాపు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామల లవ కుమార్ పటేల్. మున్నూరు కాపు యువత గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు మామిడి బాలకృష్ణ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాల వినియోగ నివారణపై అవగాహన కార్యక్రమం



సికింద్రాబాద్, వార్త మిర్రర్ ఆగస్టు 5..ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల (యుసిఏ అండ్ ఎస్ఎస్ ) జాతీయ సేవా పథకం (ఎన్ ఎస్ ఎస్ ) యూనిట్-%×% ఆధ్వర్యంలో "మత్తు పదార్థాల వినియోగ నివారణపై" ఒక-రోజు అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.డా. చలమల్ల వెంకటేశ్వర్లు, డా. శివానంద్ యలాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారుల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించారు. జాతీయ సేవా పథకం యొక్క ముఖ్య ఉద్దేశాలు దాని లక్ష్యాలు మనం చేయాల్సిన కర్తవ్యాలు గురించి వివరించారు.కళాశాల గది సంఖ్య 121లో ఉదయం 11 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో పాల్గొని మత్తు వ్యసనాలపై చైతన్యం పొందారు.ఈ కార్యక్రమానికి ప్రధాన అతిథిగా ప్రొఫెసర్ సి.కాసీం, ప్రిన్సిపల్, హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ సి.కాసీం మాట్లాడుతూ మత్తు పదార్థాల ప్రభావం, యువతపై దాని దుష్ప్రభావాలు, అలాగే బాధ్యతాయుతమైన ప్రవర్తన గురించి ప్రసంగించారు. జాతీయ సేవా పథకం పూర్వం అనేకమంది జాతీయ ఉద్యమంలో పాల్గొని అదేవిధంగా దేశసేవకై భగత్ సింగ్ సుభాష్ చంద్రబోస్ చంద్రశేఖర్ అజాద్ లాంటివాళ్ళు అనేక రూపాల్లో దేశానికి సేవ చేశారు 1969లో ప్రారంభమైన జాతీయ సేవా పథకం అనేక మార్పులకు లోనై నేడు అది కేవలం యువత ను మార్చే ప్రత్యేక కార్యక్రమంలో వీరిని దేశ సేవకై వినియోగించుకుని ఒక ఆయుధంగా పనికొస్తుంది కానీ మెజారిటీగా ఉన్నాయా యువత నేడు అనేక ప్రలోభాలకు లోనై అది దేశంలో ఒక మత్తుపదార్థంగా మరియు అదేవిధంగా అనర్థాలకు దారి చేసి యువతను చెడు అలవాట్లకు కళాశాలలో చేరి అది దేశంలో ప్రతి ఒక్కరూ దాన్ని నిర్మూలించి దేశానికి తోడ్పాటు ప్రయత్నం చేయాలని సూచించారు.గౌరవ అతిథిగా ప్రొఫెసర్ ఈ. విద్యాసాగర్, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ఓయూ పాల్గొన్నారు. జాతీయ సేవా పథకం ప్రస్తుతం వికసిద్భారత్ 2047 లో ఏవిదంగా యువత పాటుబడలో వివరించారు.ఈ కార్యక్రమంలో సుధాకర్ శ్రీపాద, రాష్ట్ర సమన్వయకర్త, ఎస్ ఎల్ సి ఏ,మధుసూదన్ రెడ్డి, నేషనల్ యాక్షన్ ప్లాన్ ఫర్ డ్రగ్ డిమాండ్ రెడక్షన్, డైరెక్టర్ ప్రోగ్రామ్స్, డీ-అడిక్షన్ కౌన్సిల్ ఫర్ అర్బన్ అండ్ రూరల్ ఎన్‌హాన్స్‌మెంట్, మరియు రాథోడ్ గోవింద్ సింగ్ నాయక్, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్, డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్, ముఖ్య వక్తలుగా హాజరై విద్యార్థులకు మత్తు పదార్థాల అనర్థాలపై విలువైన అవగాహన కల్పించారు.డా. కొండ నాగేశ్వర రావు, వైస్ ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రస్తుతం సమాజానికి యువత చేయాల్సిన కర్తవ్యం గురించి వివరించారు.అంతిమంగా, విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన జీవనశైలి, బాధ్యతాయుతమైన సమాజం నిర్మాణం పట్ల మక్కువ పెంపొందించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం.

# నిరుపేదల సంక్షేమానికి ఎప్పుడూ అడ్డుపడము

### - ఘాటుగా స్పందించారు మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి .... ఆగస్టు 5 ... మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వై.ఏ.ఆర్ గార్డెన్‌లో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం తీవ్ర రాజకీయ వివాదానికి దారితీసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఎమ్మెల్సీ సురభి వాణీ దేవి ప్రోటోకాల్‌ను ఉల్లంఘించి రాజకీయ ప్రచార వేదికగా మార్చినందుకు వేదిక నుండి వాకౌట్ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఇది ప్రభుత్వ కార్యక్రమమా లేక పార్టీ ప్రచార వేదికా అనేదే అర్థం కావడం లేదు. ప్రోటోకాల్‌ను ఖాతరు చేయకుండా, పోలీసులను వినియోగించి ముందుగానే స్కెచ్ వేసినట్టు కనిపిస్తోంది. ఇది ప్రజాస్వామ్య పరమార్థానికి భంగం. అని మండిపడ్డారు.అలాగే,కేసీఆర్ పాలనలో ఎప్పుడూ ప్రజాసేవే ప్రథమం. ఒక రేషన్ కార్డు కూడా రాజకీయ ప్రయోజనం కోసం ఇవ్వలేదు. కానీ రేవంత్ సర్కార్ మాత్రం ప్రతి సంక్షేమాన్ని తమ ఖాతాలో వేసుకోవాలని చూస్తోంది. రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ. దీన్ని పెద్ద ప్రచార కార్యక్రమంగా మార్చడం హాస్యాస్పదం.అని తీవ్రంగా స్పందించారు.ఎన్నికల ముందు చెప్పిన హామీలను నిలబెట్టుకోలేక, ఇలాంటివే చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారు. ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారు. పోలీసుల రక్షణతో ఎంతకాలం పరిపాలిస్తారు అని ప్రశ్నించారు.పొద్దున్నుంచి వేచి ఉన్న లబ్ధిదారులకు కార్డులు ఇవ్వకుండా, ఒక పార్టీ సభలా మార్చడం పట్ల గౌరవం లేదు. వారు నిరుత్సాహంతో వెళ్లకుండా ఉండేందుకు మేమే కార్యక్రమం నుంచి వెళ్లిపోయాం అని తెలిపారు. అంతేకాకుండా, జర్నలిస్టుల పట్ల కూడా దురుసుగా వ్యవహరించడం, వేదికపై తమ అనుకూలులకే ప్రాధాన్యత ఇవ్వడం. ఇదంతా పథకం ప్రకారమే జరిగింది. ఇది రేవంత్ సర్కార్ అసలు స్వరూపానికి నిదర్శనం. అని ఆరోపించారు.ఈ కార్యక్రమానికి మహేశ్వరం నియోజకవర్గం నలుమూలల నుంచి బిఆర్ఎస్ కుటుంబ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు.

# ఘనంగా అంగన్వాడీ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు

### పెద్దమనిగల్ అంగన్వాడి సెక్టర్లు బాలింతలకు అవగాహన కల్పించిన సూపర్వైజర్




నేరేడు గొమ్ము ఆగస్టు 05 వార్త మిర్రర్ నేరేడు గొమ్ము మండలం పెద్దమనిగల్ సెక్టార్ పరిధిలోని పెద్దమనగల్ అంగన్వాడి కేంద్రంలో మంగళవారం నాడు తల్లిపాల వారోత్సవాలు సూపర్వైజర్ శోభ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా అంగన్వాడి సూపర్వైజర్ శోభ మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలకు బాలింతలకు తల్లిపాలు తాగడం వలన పుట్టిన బిడ్డకి తల్లిపాల వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని పుట్టిన బిడ్డకు మెదడు నుండి సంకేతాలు వెలువడి ఆక్సిటోసి అనే హార్మోన్ విడుదలవుతుందని వారు తెలిపారు. మహిళలకు గర్భాశయం త్వరగా సంకోచించడానికి దోహదం చేస్తుందని దాంతోపాటు కాంపోనంతరం వీటివల్ల రక్తస్రావం కూడా తగ్గడంలో తోడ్పడుతుందని వారు తెలిపారు. బిడ్డకు పాలు ఇవ్వడం వల్ల ప్రెగ్నెన్సీ సమయంలో పెరిగిన బరువు తగ్గుముఖం పట్టడంలో అదేవిధంగా పిల్లలు ఎదగాలంటే పాలు పట్టడం వల్ల తద్వారా తల్లులు కూడా బరువు తగ్గుతారని ఈ కార్యక్రమంలో వారు అన్నారు. తల్లికి కూడా దీర్ఘకాలిక వ్యాధులు బారిన పడకుండా ఉంటారని కొలెస్ట్రాల్ ఉండడం వలన పిల్లలకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని వీటివల్ల బిడ్డ ఆరోగ్యంగా పెరుగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు అంగన్వాడి టీచర్లు అరుణ భాగ్యమ్మ సువార్తా సరిత లక్ష్మీ గర్భిణీ స్త్రీలు బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

# గత ప్రభుత్వంలో ప్రతిపక్షాలకు సంకేళ్లు వేశారు: మంత్రి శ్రీధర్ బాబు

### -బీఆర్ఎస్ నేతలు.. పేదలకు ఇచ్చే రేషన్ కార్డుల పంపిణీని అడ్డుకునే కుట్ర

### మల్లాపూర్ వై ఎ ఆర్ కన్వెన్షన్ లో పేదలకు సన్నబియ్యంతో బువ్వ పెట్టిన కేఎల్ఆర్.



వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి .... ఆగస్టు 5 ...గత ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష నేతలను ప్రభుత్వ కార్యక్రమాలకు రాకుండా హౌస్ అరెస్టులు చేసిన సంగతి మాజీ మంత్రి సబిత మరిచిపోయినట్లుందని ఎద్దేవా చేశారు రంగారెడ్డి జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు. మంగళవారం మహేశ్వరం నియోజకవర్గంలో 12 వేల నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని మల్లాపూర్ వై ఏ ఆర్ కన్వెన్షన్ హాల్ లో ప్రారంభించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన లబ్దిదారులకు మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో రేషన్ కార్డులను అందజేశారు.ఈ కార్యక్రమానికి వచ్చిన స్థానిక ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి అనుచరులు రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో గందరగోళం కాసేపు సృష్టించారు. ప్రతీగా కేఎల్ఆర్ జిందాబాద్.. సబిత గోబ్యాక్ అంటూ కాంగ్రెస్ శ్రేణులు నినాదాలు చేశారు. దీంతో బీఆర్ఎస్ నాయకులు వెనుదిరిగారు.ఎన్ని అడ్డంకులు ప్రతిపక్షాలు సృష్టించినా పేదలకు ఇచ్చిన హామీలు, రేషన్ కార్డుల పంపిణీని కచ్చితంగా కొనసాగించి తీరుతామని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.ఈ సందర్భంగా కేఎల్ఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజాపాలనలో పేదలకు రెండేళ్లలో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వటం సంతోషం అన్నారు.గత బీఆర్ఎస్ పాలనలో 10 ఏళ్లు ఎదురు చూసినా పేదలకు ఒక్క సంక్షేమ పథకం అందలేదని విమర్శించారు. నియోజకవర్గ అభివృద్ధిని అడ్డుకుంటే పేద ప్రజలు బీఆర్ఎస్ నాయకులపై తిరగబడే పరిస్థితి వస్తుందని లక్ష్మారెడ్డి హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రేషన్ కార్డుల లబ్దిదారులు, ఇందిరమ్మ కమిటీలు, జిల్లా ఉన్నతాధికారులు, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.



## కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను సందర్శించిన అధికారులు

మిర్యాలగూడ , ఆగస్టు 5:- (వార్త మిర్రర్) మిర్యాలగూడ మండలం అవంతిపురం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని మంగళవారం జెండర్ ఇక్వాలిటీ కో ఆర్డినేట్ ఆఫీసర్ అరుంధతి ఆకస్మికంగా ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినిలలో పఠన సామర్థ్యాన్ని పరీక్షించేందుకు ప్రశ్నలు అడిగి సమాధానాలు తెలుసుకున్నారు. స్టోర్ రూం, వంట గది, పరిసరాలు పరిశీలించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఆమె వెంట మిర్యాలగూడ మండల విద్యాధికారి ఎల్. బాలునాయక్ ఉన్నారు.



## నూతన రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న యేలిమేటి అమరేందర్ రెడ్డి

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి .... ఆగస్టు 5 ...మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గల బాలాపూర్ లొ యెలిమేటి అమరేంద్ర రెడ్డి కన్వేన్శన హాల్ లో మంగళవారం జరిగిన నూతన రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రంగారెడ్డి జిల్లా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రభుత్వ చీఫ్ విప్ ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా నూతన రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమంలో కాంటెస్టెడ్ ఎమ్మెల్యే టీపీసీసీ కార్యదర్శి యేలిమేటి అమరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

వార్త మిర్రర్
బుధవారం, ఆగస్టు 6, 2025



## మహేశ్వరంలో కాంగ్రెస్ పార్టీ కి భారీ షాక్

### -కర్రోళ్ల చంద్రయ్య నేతృత్వంలో 40 మందికి పైగా బిఆర్ఎస్‌లో చేరిక

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి .... ఆగస్టు 5 ... మహేశ్వరం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీకి తీవ్ర ఎదురుదెబ్బ తగిలింది. బి ఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కర్రోళ్ల చంద్రయ్య ఆధ్వర్యంలో దాదాపు 40 మంది నాయకులు,కార్యకర్తలు, మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు.చేరిక అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమవుతోంది. కిందిస్థాయిలో పార్టీ కార్యకలాపాలు ప్రజలకు న్యాయం చేయలేక పోతున్నాయి. ప్రజల పక్షాన నిలబడి, అభివృద్ధికి నడుంకట్టాలంటే సబితమ్మ నేతృత్వం అవసరం అని వ్యాఖ్యానించారు.పార్టీలో చేరిన వారిలో షేక్ చోటే మియా, షేక్ ఆజాం, షేక్ అనీఫ్, షేక్ షానావాస్, షేక్ సలీం, షేక్ సయ్యద్, షేక్ సిరాజ్, ఫహాగ్, లడ్డు, చింటూ, పింటూ, మహేష్, శ్రీకాంత్, రవి, బన్నీ, ఖలీం భాయ్, కాట్లావత్ శివ, ఖాజ, అక్బర్, కబీర్, ఆసిఫ్, ఇర్ఫాన్, కుమార్, శివ, ఆకాష్, ఫరీద్, షమీర్, ఆమేర్, ఇస్మాయిల్, ఆదిరాల భరత్ తదితరులు.ఉన్నారు ఈ చేరికతో మహేశ్వరం నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ మరింత బలపడుతుందన్నారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..






## పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్లో ఘనంగా పోస్టర్ తయారీ పోటీలు


సికింద్రాబాద్, వార్త మిర్రర్ ఆగస్టు 5 ...భారత మహిళా సైంటిస్ట్ అసోసియేషన్ ( ఐ డబ్ల్యు ఎస్ ఏ) హైదరాబాద్ బ్రాంచ్, అత్తాపూర్ లోని పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ కలిసి మనిషి ఆరోగ్యంపై కల్తీ ఆహారం చూపే ప్రభావాలపై అద్భుతమైన పోస్టర్ తయారీ పోటీని సంయుక్తంగా నిర్వహించారు.డాక్టర్ పద్మజ, ప్రొఫెసర్ విజయ ఖాదర్, డాక్టర్ కల్పన, డాక్టర్ సత్యవాణి ఈ పోటీకి న్యాయనిర్ణేతలుగా హాజరయ్యారు.6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు 35 మందికి పైగా విద్యార్థులు చురుకుగా పాల్గొని డిజైన్లు, సృజనాత్మకత ద్వారా ఈ అంశంపై తమ ఆలోచనలను ప్రదర్శించారు. విద్యార్థులు తమ పోస్టర్లను కూడా ప్రేక్షకులకు వివరించారు. డాక్టర్ పద్మజ ప్రేక్షకులను ఉద్దేశించి ప్రసంగించారు. అలాగే ఆహార కల్తీనిఆ ఆపే మార్గాలపై చర్చగా జరిపారు. తర్వాత డిజైన్, సందేశం ఆధారంగా ముగ్గురు ఉత్తమ విజేతలను ఎంపిక చేశారు. మొదటి బహుమతిని అన్వేషహొతా గెలుచుకున్నారు. రెండవ బహుమతిని ఎస్. సూర్యవిఘ్నేష్, మూడవ బహుమతిని కేతన్ రెడ్డి యద్దుల గెలుచుకున్నారు. తనిశ్కా తన్మయీ దాష్ కు కన్సోలేషన్ బహుమతి లభించింది.స్కూల్ ప్రిన్సిపాల్ అన్నపూర్ణ ఈ కార్యక్రమంలో పాల్గొన్న న్యాయనిర్ణేతలకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా బృందం ఇచ్చిన మార్గదర్శకత్వాన్ని అనుసరించి ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను ప్రారంభించాలని ఆమె సూచించారు.

## ఎస్‌సీఆర్‌కి 465 కోట్ల ఆదాయం

హైదరాబాద్ , మే 9 : దక్షిణ మధ్య రైల్వే(ఎస్‌సీఆర్) అంచనాలకుమించి రాణిస్తున్నది. గత నెలలో ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేర్చడం ద్వారా రూ.465.38 కోట్ల ఆదాయం సమకూరినట్టు రైల్వే అధికారులు తెలిపారు. ఒక నెలలో ఇంతటి స్థాయిలో ఆదాయం రావడం ఇదే తొలిసారని రైల్వే ఉన్నతాధికారులు తెలిపారు. ఏప్రిల్ 2023లో 2.19 కోట్ల మంది ప్రయాణికులు రైల్వేను వినియోగించుకున్నారు. క్రితం ఏడాది ఇదే నెలలో 1.72 కోట్ల మంది ప్రయాణికులతో పోలిస్తే 27.10 శాతం అధికమని పేర్కొంది. రోజు నడిచే రైళ్లతోపాటు 65 ప్రత్యేక రైళ్లు ప్రవేశపెట్టడం కూడా ఆదాయం పెరగడానికి దోహదం చేసినట్టు తెలిపారు. అలాగే 11.298 మెట్రిక్ టన్నుల సరుకు రవాణా చేసింది. తద్వారా రూ.1,106 కోట్ల ఆదాయం ఆర్జించింది.

## పెన్నార్‌కు 682 కోట్ల ఆర్డర్

హైదరాబాద్, మే 9:పెన్నార్‌కు మరో రూ.682 కోట్ల విలువైన ఆర్డర్లు ఆకట్టుకోగలిగింది. ఈ ఆర్డర్లు టాటా స్టీల్, హిందుస్థాన్ కోకాకోలా, ఏపీఐ స్కాడ్ ప్రాసెసింగ్, జిమ్ ల్యాబోల నుంచి వచ్చాయని పేర్కొంది. అలాగే రైల్వే వర్టికల్‌కు ఐసీఎఫ్, రైట్స్, ఒరియంటల్, ఎస్‌సీఆర్, ఈసీఆర్‌ల నుంచి ఆర్డర్లు వచ్చాయని వెల్లడించింది.



## ఘనంగా జిల్లా విశ్వ హిందూ పరిషత్ బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో రక్షాబంధన్

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఆగస్టు 5 జగిత్యాలలో టౌన్ హాల్లో విశ్వహిందూ పరిషత్, బజరంగ్దళ్ ఆధ్వర్యంలో రక్షాబంధన్ ఉత్సవం ఘనంగా జరిపారు. పెద్ద సంఖ్యలో విద్యార్థినిలు, మహిళలు పాల్గొని రక్షాబంధన్ ఒకరిని ఒకరు కట్టు కొని రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తగా వచ్చినటువంటి సుంకర మౌనిక మాట్లాడుతూ హిందూ మహిళలు అమ్మాయిలు మన హైందవ సంస్కృతిలో కట్టు బొట్టు మరియు సాంప్రదాయాలు మన పండుగలు, జరుపుకోవాలని, విద్యార్థినిలు లవ్ జిహాదుల బారిన పడకూడదని. అలా జరిగిన వారు ఎంతోమంది హిందూ అమ్మాయిలు ఇబ్బందులు పడి మరణించారని అన్నారు. ఈ కార్యక్రమంలో భీమనాతి ఉమా, డాక్టర్ మృదులా రెడ్డి, ముదిగంటి ఉమారాణి, కలువ సునంద, ఒద్నాల రజిత, వాణిశ్రీ, వి హెచ్ పి జగిత్యాల జిల్లా అధ్యక్షులు బోయిని పద్మాకర్, జగిత్యాల నగర అధ్యక్షులు జిట్టవేణి అరుణ్ కుమార్, జిల్లా సహ కార్యదర్శి గాజోజు సంతోష్ కుమార్, జగిత్యాల జిల్లా కార్యదర్శి కస్తూరి రాజన్న, నగర కార్యదర్శి ఎదురుగట్ల పరంధాం, భజరంగ్ద ళ్ నగర సంయోజక్ పాదం మహేందర్, విశ్వ, దుర్గంకృష్ణ, వెంకటేష్, ఏసిఎస్ రాజు, చిట్ల గంగాధర్, అశోక్ రావు, జగిత్యాల లోని వివిధ కాలేజ విద్యార్థి విద్యార్థినులు పాల్గొన్నారు.






## రూ.1,440 కోట్ల డీల్, వేదాంత చేతికి మీనాక్షి ఎనర్జీ

హైదరాబాద్, : విద్యుత్ ఉత్పత్తి రంగంలో ఉన్న మీనాక్షి ఎనర్జీని రూ.1,440 కోట్లకు కొనుగోలు చేసేందుకు వేదాంత తాజాగా నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) హైదరాబాద్ బెంచ్ నుంచి ఆమోదం పొందింది. రుణ భారంతో ఉన్న మీనాక్షి ఎనర్జీని విక్రయించడానికి పిలిచిన టెండర్లలో విజయవంతమైన బిడ్డర్‌గా వేదాంతను ఈ ఏడాది జనవరిలో ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరులో మీనాక్షి ఎనర్జీకి 1,000 మెగావాట్ల బొగ్గు ఆధారిత విద్యుత్ ప్రాజెక్టు ఉంది. ఈ పవర్ ప్లాంట్‌ను స్వతంత్ర విద్యుత్ ఉత్పత్తిదారుగా నిర్వహించాలని వేదాంత యోచిస్తోంది. అలాగే వినియోగదారులతో విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను కుదుర్చుకోనుంది. కొనుగోలు ప్రక్రియలో భాగంగా రుణదాతలకు ముందస్తుగా రూ.312 కోట్లను వేదాంత చెల్లించనుంది.



## హైదరాబాద్ మార్కెట్లో పెరిగిన ఇళ్ల సరఫరా

### ముఖ్య పట్టణాల్లో మిశ్రమ ధోరణి.. ప్రాప్‌ఈక్విటీ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: హైదరాబాద్ మార్కెట్లో అమ్ముడుపోని ఇళ్ల సంఖ్య ఈ ఏడాది ఏప్రిల్%--%జూన్ త్రైమాసికంలో 5 శాతం పెరిగి 99,989 యూనిట్లుగా ఉన్నాయి. దేశంలోని తొమ్మిది ముఖ్య పట్టణాల్లో ఇళ్ల అమ్మకాలు ఏప్రిల్%--%జూన్ కాలంలో 1,22,213 యూనిట్లుగా నమోదయ్యాయి. అదే సమయంలో నూతన సరఫరా 1,10,468 యూనిట్లుగానే ఉంది. దీంతో మొత్తం మీద అమ్ముడుపోని ఇళ్ల నిల్వలు తగ్గినట్టు ప్రాప్‌ఈక్విటీ సంస్థ ఓ నివేదిక రూపంలో వెల్లడించింది. తొమ్మిది పట్టణాల్లో కలిపి అమ్ముడుపోని యూనిట్లు 2 శాతం తగ్గి 5,15,169 యూనిట్లుగా ఉన్నాయి. మార్చి త్రైమాసికం చివరికి వీటి సంఖ్య 5,26,914 యూనిట్లుగా ఉంది.

## సంక్షోభం: చైనా రియల్ ఎస్టేట్ దిగ్గజం ఎవర్‌గ్రాండే సంచలనం



చైనీస్ ప్రాపర్టీ దిగ్గజం ఎవర్‌గ్రాండే గ్రూప్ సంచనల విషయాన్ని ప్రకటించింది. ఇప్పటికే తీవ్ర సంక్షోభంలో ఉన్న చైనా రియల్టీ రంగాన్ని ప్రతిబింబిస్తూ దేశంలోని రెండో అతిపెద్ద ప్రాపర్టీ డెవలపర్ దివాలా తీసినట్టు ప్రకటించింది. ఈ మేరకున్యూయార్క్ కోర్టులో దివాలా కోసం దాఖలు చేసింది. చైనాలో అగ్రశ్రేణి కంపెనీలు నిర్మాణాలను పూర్తి చేయడానికి డబ్బు కోసం కష్టపడుతున్న నేపథ్యంలో ఈ పరిణామం మరింత ఆందోళన రేపింది.

ప్రపంచంలోనే అత్యధికంగా అప్పుల్లో కూరుకుపోయిన ప్రాపర్టీ డెవలపర్ ఎవర్‌గ్రాండే న్యూయార్క్ కోర్టులో చాప్టర్-15 కింద దివాలా రక్షణను దాఖలు చేసింది. వివిధ బ్యాంకులతో పలు మల్టీ మిలియన్ డాలర్ల రుణాల కోసం చర్చలు జరుపుతున్న నేపథ్యంలో అమెరికా తన ఆస్తులను రక్షించుకోవాలని ప్రయత్నిస్తోంది. ఎవర్‌గ్రాండే ప్రస్తుత అప్పులు విలువ 300 బిలియన్ డాలర్లకు పైమాటే. 2021లో కంపెనీల రుణాల చెల్లింపుల్లో డిఫాల్ట్ అయ్యింది. ఇది చైనా ఆర్థిక వ్యవస్థలో భారీ ఆస్తి సంక్షోభాన్ని రేకెత్తించింది. పెరుగుతున్న గృహాల ధరలను అదుపు చేసే ప్రయత్నంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు అధికంగా రుణాలు తీసుకోవడంపై చైనా ప్రభుత్వం చర్యలు ప్రారంభించిన తర్వాత సంస్థ డిఫాల్ట్ వచ్చింది. ఈ పరిణామాల నేపథ్యంలో 2022 మార్చి నుంచి కంపెనీ హాంకాంగ్-లిస్టెడ్ షేర్ల ట్రేడింగ్ నిలిచి పోయింది. అంతేకాదు గతరెండేళ్లలో కంపెనీ ఏకంగా 80 బిలియన్ డాలర్లు నష్ట పోయినట్లు ?స్వయంగాఎవర్‌గ్రాండే జూలైలో నివేదించిన సంగతి తెలిసిందే. కంపెనీ వెబ్‌సైట్ ప్రకారం, ఎవర్‌గ్రాండే 280 కంటే ఎక్కువ నగరాల్లో 1,300 లకు పైగా రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్‌లను నిర్వహిస్తోంది.మరోవైపు చైనా ఆర్థిక వృద్ధి మందగమనంతో ఎగుమతులు కూడా క్షీణించాయి. చైనా యువత నిరుద్యోగం రేటు కూడా రికార్డు స్థాయికి చేరుకుంది. డాలరు మారకంలో కరెన్సీ పతనమవుతోంది. దీంతో ఇటీవల ద్రవ్యోల్బణాన్ని కట్టి చేసే చర్యల్లో భాగంగా చైనా కేంద్ర బ్యాంకు అనూహ్యంగా కీలక వడ్డీరేట్లను రికార్డు స్థాయికి తగ్గించడం ప్రపంచ దేశాల ఆర్థిక నిపుణులను ఆందోళనలో పడేసింది.

## గ్లోబల్ మార్కెట్లోకి పాకో ఎఫ్5 ప్రో.. ఇవీ స్పెషిఫికేషన్స్..!



ప్రముఖ స్మార్ట్ ఫోన్ల తయారీ సంస్థ పోకో.. తన ఎఫ్ సిరీస్ 'పోకో ఎఫ్5 ప్రో 5జీ ఫోన్‌ను గ్లోబల్ మార్కెట్లో ఆవిష్కరించింది. ఒక్టాకోర్ క్వాల్ కామ్ స్నాప్ డ్రాగన్ 8ం జెన్ 1 ఎస్వోసీ ప్రాసెసర్, 120 హెర్ట్జ్ అమోలెడ్ డిస్ ప్లే విత్ సపోర్ట్ ఫర్ డోల్బీ విజన్ టెక్నాలజీతో వస్తున్నది. ఈ ఫోన్ ట్రిపుల్ రేర్ కెమెరా యూనిట్ కలిగి ఉంటుంది. 5160 ఎంఏహెచ్ కెపాసిటీ గల బ్యాటరీ విత్ సపోర్ట్ 67 వాట్ల వైర్డ్ టర్బో చార్జింగ్ అండ్ 30 వాట్ల వైర్ లెస్ చార్జింగ్ తో వస్తుంది. పోకో ఎఫ్5 ప్రో 5జీ ఫోన్ 8జీబీ రామ్ విత్ 256 జీబీ ఇంటర్నల్ స్టోరేజీ వేరియంట్ దాదాపు రూ.36,000 (449 డాలర్లు) పలుకుతుంది. 12 జీబీ రామ్ విత్ 256 జీబీ ఇంటర్నల్ స్టోరేజీ వేరియంట్ సుమారు రూ.41,000 (499 డాలర్లు), టాప్ ఎండ్ మోడల్ 12 జీబీ రామ్ విత్ 512 జీబీ ఇంటర్నల్ స్టోరేజీ వేరియంట్ ఫోన్ సుమారుగా రూ.45 వేలు (549 డాలర్లు) పలుకుతుంది. గ్లోబల్ మార్కెట్లో ఎర్లీ బర్డ్ ఆఫర్ కింద ఈ ఫోన్లు 429 డాలర్లు, 449 డాలర్లు, 499 డాలర్లకు లభిస్తాయి. బ్లాక్, వైట్ కలర్ ఆప్షన్లలో ఈ ఫోన్ లభిస్తుంది. ఈ ఫోన్‌ను భారత్ మార్కెట్లో ఎప్పుడు ఆవిష్కరిస్తారన్న సంగతి వెల్లడించలేదు. అయితే, పోకో ఎఫ్5 5జీ ఫోన్ ఇప్పటికే భారత్ మార్కెట్లోకి వచ్చేసింది. 8జీబీ రామ్ విత్ 256 జీబీ ఇంటర్నల్ స్టోరేజీ వేరియంట్ ధర రూ.29,999 పలుకుతున్నది.

### ఇవీ పోకో ఎఫ్5 ప్రో 5జీ స్పెషిఫికేషన్లు

పోకో ఎఫ్5 5జీ ఫోన్‌లో మాదిరిగానే పోకో ఎఫ్5 ప్రో 5జీ ఫోన్‌లో కూడా సిమ్, సాఫ్ట్ వేర్, డిస్ ప్లే స్పెషిఫికేషన్లు ఉంటాయి. ద్యుయల్ (సిమ్) పోకో ఎఫ్5 ప్రో 5జీ ఫోన్ ఆండ్రాయిడ్ 13 బేస్డ్ ఎంఐయూఐ 14 వర్షన్‌పై పని చేస్తుంది. 6.67-అంగుళాల డబ్ల్యూక్యూహెచ్ డీ ం (1,440ఐ3,200 పిక్సెల్స్) ఫ్లో అమోలెడ్ డిస్ ప్లే విత్ 120 హెర్ట్జ్ రీఫ్రెష్ రేట్‌తో వస్తున్నది. 240 హెర్ట్జ్ టచ్ శాంప్లింగ్ రేట్, 1400 నిట్స్ పీక్ బ్రైట్ నెస్ కలిగి ఉంటది. పోకో ఎఫ్5 5జీ ఫోన్ ట్రిపుల్ రేర్ కెమెరా యూనిట్ తో వస్తున్నది. 64-మెగా పిక్సెల్ సెన్సర్, 8-మెగా పిక్సెల్ సెన్సర్ విత్ ఆల్ట్రా వైడ్ లెన్స్, 2-మెగా పిక్సెల్ సెన్సర్ విత్ మాక్రో లెన్స్ కెమెరాలు ఉంటాయి. సెల్ఫీల కోసం 16-మెగా పిక్సెల్ కెమెరా సెన్సర్ ఉంటుంది. పోకో ఎఫ్5 5జీ ఫోన్ మాదిరిగానే కనెక్టివిటీ ఆప్షన్లు ఉంటాయి.

## భారత్‌లో బెస్ట్ సెల్లింగ్ కారు మారుతి వ్యాగన్-ఆర్!

కరోనాకు ముందుతో పోలిస్తే.. తర్వాతి కాలంలో ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఒక్కరూ పర్సనల్ మొబిలిటీకి ప్రాధాన్యం ఇస్తున్నారు. సాధ్యమైనంత మేరకు స్పేసియస్‌గా, ఎక్కువ మంది ప్రయాణించడానికి వీలుగా ఉండే ఎస్‌యూవీ కార్ల కొనుగోళ్లకు మొగ్గుతున్నారు. గతేడాది 2022లో అమెరికన్లు ఫోర్డ్ ఎఫ్ సిరీస్ ఎస్ యూవీ కార్లపై మోజు పెంచుకున్నా.. తర్వాత ఇండియాలో బెస్ట్ సెల్లింగ్ కారుగా మన మారుతి వ్యాగన్-ఆర్ నిలిచింది. భారత్ మొదలు అగ్రరాజ్యం అమెరికా, బ్రిటన్, చైనా, జర్మనీ దేశాల్లో అత్యధికంగా అమ్ముడైన కార్ల వివరాలు తెలుసుకుందామా.. ! అగ్రరాజ్యం అమెరికాలో ప్రపంచ ప్రఖ్యాతి చెందిన కార్ల తయారీ సంస్థ ఫోర్డ్.. ఎఫ్ సిరీస్ కార్లపై అమెరికన్లు మనసు పారేసుకున్నారు. 2022లో అత్యధికంగా ఫోర్డ్ 'ఎఫ్' సిరీస్ కార్లు సొంతం చేసుకున్నారు. 2021తో పోలిస్తే గతేడాది (2022)లో 9,08,921 కార్లు అమ్ముడయ్యాయి. 2021లో 8,94,757 కార్లు సేల్ అయ్యాయి. 2022లో ఎస్‌యూవీ కార్లు 8,61,256 అమ్ముడు పోయాయి.

